క్లుప్తంగా

రేపటి నుంచి ఉచిత యోగా శిబిరం

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో సోమవారం నుంచి ఉచిత యోగా శిబిరం నిర్వహించనున్నట్లు బోధక యోగాచార్యులు నేరెళ్ల తులసీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోసాలకు చెందిన శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో 68వ ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని పెనమలూరు జెడ్పీ హైస్కూల్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు 28 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 91333 06804 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

హ్యాండ్‌బాల్ గోల్‌పోస్టులు అందజేత

కంకిపాడు: తెన్నేరు జెడ్పీ పాఠశాలకు గ్రామానికి చెందిన మిక్కిలినేని సత్యనారాయణ చౌదరి కుమారుడు, ఎన్‌ఆర్‌ఐ హేమ సుందర్ నాలుగు హ్యాండ్ బాల్ గోల్ పోస్టులను పాఠశాల హెచ్‌ఎం రోజ్ మేరీ, ఉపాధ్యాయులకు శనివారం అందజేశారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు హేమసుందర్ ముందుకు రావడం సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ ఎల్ నాగబాబు, సీనియర్ ఉపాధ్యాయుడు సీతారామమూర్తి, పీడీ ఎం సాయికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలు అవ్వడంతో పెనమలూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పెనమలూరు గ్రామానికి చెందిన అరవపల్లి రామకృష్ణ గంగూరు చేపల కుండీల వద్ద చేపల వ్యాపారం చేస్తాడు. అతను వ్యాపారం ముగించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరగా మార్గ మధ్యలో వికాస్ స్కూల్ వద్ద కంకిపాడు నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో రామకృష్ణకు గాయాలు అవ్వడంతో పోరంకిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సత్తా చాటిన బాపులపాడు విద్యార్థినులు



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయులు తోట వెంకట నాగేశ్వరరావు తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో ఎనిమిదో తరగతి విద్యార్థిని కే లాస్య ఉత్తమ మార్కులతో సీటు సాధించగా, నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో మరో విద్యార్థిని ఎం పల్లవి ఎంపిక అయినట్లు తెలిపారు. వీరిద్దరిని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు శనివారం జ్ఞాపికలతో అభినందించారు.

బాబోయ్.. భౌభౌలు

- గ్రామాల్లో వీధి కుక్కల స్వైర విహారం
- రోడ్లపైకి రావాలంటే హడలెత్తుతున్న ప్రజలు



ఎనికేపాడులో ప్రధాన రహదారిపై సంచరిస్తున్న వీధి కుక్కలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రానూ రానూ వీటి సంఖ్య పెరిగిపోతూ ఉండటంతో ఆయా గ్రామాల్లోని ప్రజలకు కంటి మీద కునుకు కరువైంది. ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారి, అంతర్గత రహదారులు, పలు కాలనీల్లో గుంపులు గుంపులుగా వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. ఒక్కో గ్రామంలో సుమారు 100 నుంచి 150 వరకూ ప్రధాన, అంతర్గత రహదారుల్లో తిరుగుతూ పాదచారులు, మహిళలు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. గతంలో రామవరప్పాడు బల్లెం వారి వీధిలో పాఠశాలకు వెళుతున్న విద్యార్థిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. అలాగే ఎనికేపాడు ఎస్సీ కాలనీలో మరీదు శ్రీను, యేసోబు, అంజయ్య మరికొందరిపై దాడి చేయడంతో చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. అప్పట్లో పంచాయతీ కార్యదర్శికి వీధి కుక్కలను నిర్మూలించాలని వినతి పత్రాలను కూడా సమర్పించారు.

భయాందోళనలో ప్రజలు

వీధి కుక్కల భయంతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రుళ్లు గుంపులుగా సంచరిస్తూ నివాసాల మధ్యకు చేరుకుంటున్నాయని అత్యావసర సమయాల్లో భయటకు వచ్చేవారిపై ఎగబడుతూ దాడి చేస్తున్నాయని చెబుతున్నారు. ఈ వీధి కుక్కల దెబ్బకి కళాశాలలు, ట్యూషన్ల నుంచి వచ్చే విద్యార్థులకు తోడుగా వారి వారి తల్లిదండ్రులు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై ప్రయాణించే వారిపై కుక్కలు వెంట పడటంతో ప్రమాదాలకు గురై గాయాలపాలు అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పార్కింగ్ చేసిన వాహనాల కిందకు చేరి హడలెత్తిస్తున్నాయని వాపోతున్నారు.

కు.ని ఆపరేషన్లు నిల్

ఆయా గ్రామాల్లో వీధి కుక్కల బెడద పెరిగిపోతున్న కూడా సంబంధిత పంచాయతీ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీధి కుక్కల సంతానం వృద్ధి కాకుండా వాటిని పట్టుకుని కుటుంబ నియంత్రణ (కు.ని) ఆపరేషన్లు చేయాలి. కాని ఇప్పటి వరకు రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో ఈ ఆపరేషన్లు చేయించిన దాఖలాలు లేవు. ప్రమాదకరంగా మారిన కుక్కలను పట్టుకుని వాటికి హాని తలపెట్టకుండా జనసంచారం లేని ప్రాంతాల్లో విడిచిపెట్టాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

జిల్లా వ్యవసాయాధికారి మనోహర్‌రావు



పెనమలూరులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మనోహర్‌రావు

పెనమలూరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయాధికారి మనోహర్‌రావు అన్నారు. పెనమలూరులో ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ గ్రూపులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. వ్యవసాయ భూమిలో సారం పెంచే చర్యలు తీసుకుని సాగు ఖర్చు తగ్గించి అధిక దిగుబడులు వచ్చేలా రైతులకు మెళకువలు నేర్పాలన్నారు. రైతులు నాటు, దేశవాళీ విత్తనాలు వాడటం, వ్యవసాయానికి పశువులు అనుసంధానం చేయడం, జీవ ఉత్ప్రేరకాల వినియోగం, పురుగులు, తెగుళ్ల నివారణకు యాజమాన్యం, రసాయన ఎరువుల వాడకం తగ్గించడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. ఏడీఏ సునీల్ మాట్లాడుతూ రైతుసేవా కేంద్రం సిబ్బంది రైతులతో కలిసి పని చేయాలని అన్నారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ, ఏపీఎం కృష్ణంరాజు, అధికారులు సులోచన, జేపీ రాణి, వీఏఏలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 'ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం' ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై మండలస్థాయి అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. దీనికి హాజరైన ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పార్థసారధి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులతో ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎఫ్‌పీవో, ఎఫ్‌పీజీ గ్రూపుల ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కే జోగేశ్వరరావు, ఏఓ జొన్నలగడ్డ భవాని, వీఏఏలు పాల్గొన్నారు.

టమాటా సాగులో యాజమాన్య చర్యలు చేపట్టాలి



రైతులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ సుధారాణి

కంకిపాడు: టమాటా పంట సాగులో మేలైన యాజమాన్య చర్యలు చేపట్టాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ డీ సుధారాణి సూచించారు. ఉద్యాన విభాగం ఆధ్వర్యంలో మండలంలోని మద్దూరు గ్రామంలో క్షేత్ర దినోత్సవం శనివారం నిర్వహించారు. టమాటా హైబ్రిడ్ రకం అర్కా సామ్రాట్ రకాన్ని రైతులకు ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వీ మంజువాణి సాగుపై రైతులకు సూచనలు ఇచ్చారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ అర్కా సామ్రాట్ రకం దూర ప్రాంతాలకు రవాణా చేసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. తెగుళ్లు, యాజమాన్యంపై దృష్టిసారిస్తే సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి చందు జోసఫ్ సుందరం, మండల వ్యవసాయాధికారి మాధురి కిరణ్, ఉద్యాన సహాయకురాలు అరుణకుమారి, సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ సభ్యుడు వడుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



పోరంకిలో న్యాయ సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఇందిరాప్రియదర్శిని



ఈడుపుగల్లులో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ అన్నపూర్ణశ్రీ

పెనమలూరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు జడ్జి ఇందిరాప్రియదర్శిని అన్నారు. పోరంకి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం ప్రకారం వారికి సంక్రమించిన హక్కులపై అవగాహన పొందాలన్నారు. బాలికలు నేటి సమాజంలో చాలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలని తెలిపారు. బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే తల్లిదండ్రులకు, పోలీసులకు చెప్పాలని సూచించారు. బాలికలను వేధించే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. స్మార్ట్ ఫోన్‌లు, సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. సీఐ జె.వెంకటరమణ, లీగల్ ఆఫీసర్ రాంబాబు, ఎస్‌ఐ ఫిరోజ్, హెచ్‌ఎం సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈడుపుగల్లులో..

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. విజయవాడ ఐదవ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అన్నపూర్ణశ్రీ మాట్లాడుతూ ఫోక్సో చట్టం వల్ల కలిగే ప్రయోజనాలను అవగాహన చేసుకుని, చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయవాది కే శివయ్య, సీహెచ్ సుబ్బారావు, కంకిపాడు ఏఎస్‌ఐ అనిల్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సంధ్యారాణి పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రెండవ అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానందం చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. సదస్సులో ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు జడ్జి శ్రీదేవి, నున్న ఎస్‌ఐ మహాలక్ష్ముడు, అడ్వకేట్స్ పీ రాము, రవి, మానవతా సంస్థ ప్రెసిడెంట్ డీ సాంబశివరావు, కార్యదర్శి డీ శ్రీనివాసరావు, మహిళా పోలీసులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌ను సందర్శించారు.

ఘనంగా రంజాన్ ఫెస్ట్



రంజాన్ ఫెస్ట్‌లో ఆలింగనం చేసుకుంటున్న విద్యార్థులు

గన్నవరం రూరల్: రంజాన్ మాసం పవిత్రమైనదని ముస్తాబాద నవ భారత్ హైస్కూల్ ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా అన్నారు. స్థానిక హైస్కూల్‌లో శనివారం రంజాన్ ఫెస్ట్ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో ఈద్ ముబారక్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుని ఆలింగనం చేసుకున్నారు. కరస్పాండెంట్ షేక్ ఇమాం, ఉపాధ్యాయులు హసీనా, విజయలక్ష్మి, జయశ్రీ, సునీత, అశోక్ రాణి, కౌసర్, ప్రశాంతి, రామభద్రరాజు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉగాది వేడుకలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం వెస్ట్ ఎలిమెంటరీ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను శనివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు తినిపించారు. ఉగాది పండుగ విశిష్టతను ప్రధానోపాధ్యాయురాలు భారతిదేవి వివరించారు. కొత్త సంవత్సరంలో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

రోడ్డు గుంతలు పూడ్చాలంటూ సీపీఎం నిరసన



తేలప్రోలులో గుంతలు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలు-ఉయ్యూరు ప్రధాన రహదారిలో ప్రమాదాలకు నిలయంగా మారిన తేలప్రోలు వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చాలని కోరుతూ సీపీఎం నాయకులు శనివారం నిరసన తెలిపారు. దీంతో ఆర్‌అండ్‌బీ ఏఈ హరిబాబు ఏప్రిల్ ఒకటో తేదీన గుంతలు పూడ్చుతామని చెప్పడంతో సీపీఎం నాయకులు నిరసన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు మాగంటి సాంబశివరావు, నాయకులు భీమవరపు సుబ్బారెడ్డి, శనగల జానేందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల పరిషత్ సమావేశం



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నగేష్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడి తంతుగా జరిగింది. స్థానిక మహాత్మ గాంధీనగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యర్రగొర్ల నగేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి అంతంత మాత్రంగానే ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. పలువురు మండల స్థాయి అధికారులు కూడా డుమ్మా కొట్టారు. దీంతో తూతూమంత్రంగా సమావేశం నిర్వహించి ముగించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, వైస్ ఎంపీపీ చందు రమాదేవి, ఎండీపీవో కే జోగేశ్వరరావు పాల్గొన్నారు.

గన్నవరం టీడీపీలో వర్గ విభేదాలు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం: గన్నవరంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం రోజున ఆ పార్టీలోని గ్రూపు విభేదాలు రచ్చకెక్కాయి. పార్టీ రెండు గ్రూపులుగా విడిపోయి వేర్వేరుగా పట్టణంలో ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహిస్తూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం పేరుతో బలప్రదర్శనలు చేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును విభేదిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమం ద్వారా బహిరంగంగానే తిరుగుబాటు బావుట ఎగురవేశారు. పార్టీలో యార్లగడ్డను వ్యతిరేకిస్తున్న నేతలతో కలిసి జాస్తి టీడీపీ పాత ఆఫీస్ వద్ద జెండా ఆవిష్కరించి ప్రదర్శనగా వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కొద్దిసేపటికి గన్నవరం చేరుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ కొత్త టీడీపీ ఆఫీస్‌లో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా గాంధీచౌక్‌కు చేరుకుని ఎన్టీఆర్ విగ్రహానికి జాస్తి వర్గం వేసిన పూలమాలలు తొలగించి యార్లగడ్డ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా మద్యం టెండర్లు, అధికారుల బదిలీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యవహారాలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల టెండర్ల విషయమై ఎమ్మెల్యే యార్లగడ్డతో జాస్తి వర్గం తీవ్రంగా విభేదించింది. ఈ నేపథ్యంలో అటు ఎమ్మెల్యే యార్లగడ్డ, ఇటు జాస్తి ఒకరిపై మరొకరు పలు ఆరోపణలు గుప్పిస్తూ టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. యార్లగడ్డకు వ్యతిరేకంగా జాస్తితో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, పార్టీ నేతలు జూపల్లి సురేష్, మండవ లక్ష్మీ, ఓ సీనియర్ న్యాయవాది, మరికొంత మంది రాజకీయాలు నడుపుతున్నారు. అయితే పార్టీ రెండు వర్గాలుగా విడిపోయి వేర్వేరుగా ఆవిర్భావ వేడుకలు జరుపుకోవడం కార్యకర్తలను సైతం గందరగోళానికి గురిచేసింది.

విద్యుత్ కాంతుల్లో మసీదులు



విద్యుత్ వెలుగుల్లో గోసాల మసీదు



విద్యుత్ కాంతులతో కంకిపాడు మసీదు

రంజాన్ మాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న మసీదులు విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి. రంజాన్ పురస్కరించుకుని మసీదులను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ప్రతి రోజూ ముస్లింలు నిర్దిష్ట సమయాల్లో ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. - కంకిపాడు

ఇంటి పన్నులు తగ్గించకపోతే ఆందోళన తీవ్రతరం

జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి



హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలి వద్ద నిరాహార దీక్ష చేస్తున్న చలమలశెట్టి, జనసేన నాయకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు నిరాహారదీక్ష చేపట్టారు. హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలి వద్ద శనివారం ఏర్పాటు చేసిన శిబిరంలో చలమలశెట్టితో పాటు పలువురు జనసేన నాయకులు, మహిళలు నిరాహారదీక్ష చేశారు. బాపులపాడు పంచాయతీలో 2013-14 మధ్య నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఇంటి పన్నులు విధించడంతో సామాన్య ప్రజలకు భారంగా మారిందని అన్నారు. హనుమాన్‌జంక్షన్ చుట్టుపక్కల ఉన్న ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, గుడివాడ, నూజివీడు మున్సిపాలిటీల్లో కంటే నాలుగైదు రెట్లు అధికంగా బాపులపాడులో ఇంటి పన్నులు విధించడం శోచనీయని పేర్కొన్నారు.

15లోపు తగ్గించాలి

బాపులపాడు పంచాయతీలో పెంచిన ఇంటి పన్నులు సవరించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు అర్జీలు అందజేసినా ఫలితం లేకపోవడంతో ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వచ్చిందని చలమలశెట్టి తెలిపారు. సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు దీనిపై తక్షణం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల 15వ తేదీలోపు సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరాహారదీక్ష శిబిరంలో చలమలశెట్టిని పలువురు వ్యాపారస్తులు, గ్రామస్తులు కలిసి సంఘీభావం తెలిపారు. మరోపక్క అధికార కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ భాగస్వామిగా ఉందని, అధినేత పవన్‌కల్యాణే పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా ఉండగా, ఆ పార్టీ నేతలు నిరాహారదీక్ష పేరిట రోడ్డెక్కడంపై స్థానిక రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపించడం గమనార్హం.

శాస్త్రీయ సంగీతానికి ప్రాముఖ్యత ఇవ్వాలి



శాస్త్రీయ సంగీత ప్రదర్శన ఇస్తున్న సరస్వతి రాజగోపాలన్

పెనమలూరు: భారతీయ శాస్త్రీయ సంగీతానికి యువత ప్రాముఖ్యత ఇచ్చి మన సంస్కృతిని కాపాడాలని ప్రముఖ వీణ విద్వాంసురాలు సరస్వతి రాజగోపాలన్ అన్నారు. కానూరులోని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌లో స్పీక్‌మాకే కార్యక్రమంలో భాగంగా శనివారం భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత శాస్త్రీయ, సంస్కృతిని యువతలో ప్రోత్సహించడమే తమ లక్ష్యమని తెలిపారు. భారతీయ సంస్కృతికి, కళలకు ఉన్న ప్రాధాన్యత మరే దేశంలో లేదన్నారు. ఈ సందర్భంగా వీణ విద్వాంసురాలు సరస్వతి రాజగోపాలన్, మృదంగం విద్వాంసుడు జయభాస్కర్, ఘటం విద్వాంసుడు ఎస్.హనుమంతరావు అందరినీ ఆకట్టుకునే విధంగా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ పీ వెంకటేశ్వరరావు, ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, ప్రొఫెసర్ ఎం రవిచంద్, సంస్కృతి క్లబ్ సమన్వయకర్త డాక్టర్ ఎం వెంకట్రావు, డాక్టర్ కొల్లా నరేంద్ర, డాక్టర్ బేబీరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పెనమలూరు ఎస్‌ఐ ఫిరోజ్ కథనం మేరకు.. పెదపులిపాక గ్రామం యంత్రీనాథ్‌గౌడ్ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మంది నుంచి రూ. 7,300 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.